# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ:  20-06-2024                సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ  శ్రీనగర్ లో రేపు జరగబోయే 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో పాల్గొంటారు.
- ❖ రాజధాని అమరావతి నిర్మాణంపై త్వరలో శ్వేతపత్రం విడుదల చేస్తామని ముఖ్యమంత్రి  నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
- ❖ ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలు రేపు ఉదయం ప్రారంభం కానున్నాయి.
- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" కార్యక్రమం 111వ సంచిక ఈ నెల 30వ తేదీన ప్రసారమవుతుంది.

==============================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు జమ్ముకశ్మీర్‌లో పర్యటించారు. రెండు రోజుల పర్యటనలో బాగంగా ఈరోజు 15 వందల కోట్ల రూపాయల విలువైన 84 అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధానమంత్రి ప్రారంభించారు. ప్రకృతి అందాలకు నిలయమైన శ్రీనగర్ లోని దాల్ సరస్సు ఒడ్డున రేపు జరగబోయే 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో నరేంద్ర మోదీ పాల్గొంటారు. ఈ వేడుకల్లో ప్రధానితో సహా వివిధ రంగాలకు చెందిన 7 వేల మంది యోగా చేయనున్నారు.

==============================

రాజధాని అమరావతి నిర్మాణంపై త్వరలో శ్వేతపత్రం విడుదల చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఈరోజు అమరావతి నిర్మాణాల పరిశీలన అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ, అమరావతి రైతులు 1,631 రోజులుగా ఆందోళన చేపట్టారన్నారు. ఐదు కోట్ల మంది ప్రజల భవిష్యత్తు కోసం రాజధాని నిర్మాణం మొదలు పెట్టామని తెలిపారు. అదే విధంగా పోలవరం పూర్తయితే రాష్ట్రం మొత్తానికి నీరు వస్తుందనే ఉద్దేశ్యంతో దానిని పూర్తి చేసేందుకు ప్రాధాన్యత ఇచ్చామని, పోలవరం పూర్తయితే రాయలసీమ రతనాల సీమగా మారుతుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అటువంటి రాజధాని, పోలవరం ప్రాజెక్టులను గత ప్రభుత్వం విస్మరించిందని  పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలు రేపు ఉదయం 9 గంటల 46 నిమిషాలకు ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాలకు సందర్శకుల పాస్‌లను రద్దు చేసినట్లు శాసనసభ వ్యవహాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. స్థలా భావం కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. అక్షర క్రమం ఆధారంగా సభ్యుల సిట్టింగ్ ఉంటుందని తెలిపారు. ప్రొటెం స్పీకర్‌గా గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఈరోజు సాయంత్రం రాజ్ భవన్ లో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. రేపు సభ్యులందరి చేత ప్రొటెం స్పీకర్ ప్రమాణ స్వీకారం చేయిస్తారని మంత్రి పయ్యావుల కేశవ్ వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని 2029లో ప్రజలే తిరిగి అధికారంలోకి తీసుకువస్తారని ఆ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేర్కొన్నారు. ఈరోజు గుంటూరు జిల్లా తాడేపల్లి పార్టీ కార్యాలయంలో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఆయన దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జగన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ... ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి 40 శాతం ఓటింగ్ లభించిందని గుర్తు చేశారు. 2019తో పోలిస్తే కేవలం 10 శాతం మాత్రమే ఓట్లు తగ్గాయన్నారు. భవిష్యత్‌లో ప్రజలకు మరింత దగ్గరయ్యే కార్యక్రమాలు, వారి తరఫున పోరాటాలు చేసేందుకు సిద్ధంగా ఉండాలని పార్టీ నాయకులకు జగన్‌మోహన్ రెడ్డి సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జాతీయ విద్యా విధానం 2020లో భాగంగా విద్యా ప్రవేష్ కార్యక్రమం అమలు తీరును పర్యవేక్షించేందుకు NCERT ప్రత్యేక బృందం విశాఖలో పర్యటిస్తోంది. మూడురోజుల పర్యటనలో భాగంగా NCERT ప్రొఫెసర్ డాక్టర్ షీలా మంగోసా నేతృత్వంలోని బృందం నగరంలోని ప్రకాశరావు పేట, జాలారిపేట మున్సిపల్ ప్రాధమిక పాఠశాలలను సందర్శించారు. 1వ తరగతి విద్యార్థులకు పాఠశాల సంసిద్ధత, 90 రోజుల ప్రణాళిక అమలు చేయడం ద్వారా ఎటువంటి మార్పు కనిపిస్తున్నాయనే అంశాలపై సమీక్షించారు. పాఠశాలలో ఉన్న మౌలిక సదుపాయాలు కల్పన, పరిశుభ్రత, భద్రత విషయంలో తీసుకుంటున్న జాగ్రత్తలు వంటి అంశాలను పరిశీలించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పురుషుల టీ-20 క్రికెట్ ప్రపంచ కప్ గ్రూప్ దశను విజయవంతంగా పూర్తి చేసుకుని సూపర్-8కి చేరుకుంది. ఈ సూపర్-8లో భాగంగా భారత్ అఫ్గానిస్థాన్తో ఈరోజు తొలి మ్యాచ్ ఆడనుంది. బార్బడోస్ లో బ్రిడ్జిటౌన్ వేదికగా ఈరోజు రాత్రి 8 గంటలకు ఈ మ్యాచ్ ప్రారంభం కానుంది. కాగా నిన్న జరిగిన మ్యాచ్ ల్లో వెస్టిండీస్‌పై ఇంగ్లాండ్, అమెరికాపై సౌత్ ఆఫ్రికా జట్లు విజయాలు సాధించాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్- మనసులో మాట" కార్యక్రమం 111వ సంచిక ఈ నెల 30వ తేదీన ఆకాశవాణి ద్వారా ప్రసారమవుతుంది. ప్రధానమంత్రిగా వరుసగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత జరగనున్న తొలి "మన్ కీ బాత్" కార్యక్రమం ఇది. ప్రజలు తమ సలహాలు, సూచనలను ఈ నెల 28వ తేదీ లోగా టోల్ ఫ్రీ నెంబర్ 1800-11-7800కు ఫోన్ చేసి గాని, నరేంద్ర మోదీ యాప్ ద్వారా లేదా, ఇతర వేదికల ద్వారా తెలియజేయవచ్చు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మానసిక ఆరోగ్యానికి యోగ ఒక ఔషధం వంటిదని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఉపకులపతి జి.ఎస్.ఆర్.క్రిష్ణమూర్తి అన్నారు. తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఒకరోజు ముందుగానే యోగాపై జాతీయ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ, యోగాలోని శారీరకమైన ఆసనాలు శరీర ఆరోగ్యానికి తోడ్పడుతాయన్నారు. విశ్వవిద్యాలయంలో ప్రత్యేకంగా యోగ విద్యను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొచ్చామని ప్రిన్సిపాల్ డాక్టర్ రేణు దీక్షిత్ వివరిస్తూ....

(వాయిస్ 26 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర ప్రభుత్వం 2024-25 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 14 రకాల పంటలకు కనీస మద్దతు ధరను పెంచింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన నిన్న జరిగిన మంత్రిమండలి సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నామని కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఈ రోజు ఆయన ఢిల్లీలో పాత్రికేయులతో మాట్లాడుతూ, వరి పంటకు కనీస మద్దతు ధరను క్వింటాలుకు 117 రూపాయలు పెంచామన్నారు. అత్యధికంగా వలిశలు ధర 983 రూపాయలు, నువ్వులపై 632 రూపాయలు, కందులు 550 రూపాయలు మేర పెరిగాయని తెలిపారు. ఈ పెంపుతో రైతులకు సజ్జలపై 77 శాతం, కందిపై 59 శాతం, మొక్కజొన్నపై 54 శాతం, మినుములపై 52 శాతం, మిగిలిన అన్ని పంటలపై 50 శాతం అదనపు ఆదాయం వస్తుందని కేంద్రమంత్రి వివరించారు. అదేవిధంగా దేశవ్యాప్తంగా ఉన్న ఫోరెన్సిక్ సదుపాయాలను 2 వేల 254 కోట్ల రూపాయలతో మెరుగుపరిచేందుకు మంత్రి మండలి సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని అశ్వినీ వైష్ణవ్ వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

బీసీ సంక్షేమం, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమం, జౌళి వస్త్ర పరిశ్రమ శాఖల మంత్రిగా సంజీవిరెడ్డి సవిత ఈరోజు బాధ్యతలు చేపట్టారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిరుద్యోగుల కోసం మెగా డీఎస్సీ ఫైల్ పై తొలి సంతకం చేశారని, ఆయన అడుగుజాడల్లో వెనుకబడిన తరగతుల నిరుద్యోగులకు ఉచిత డీఎస్సీ కోచింగ్ ఫైల్ పై తొలి సంతకం చేశానన్నారు. అదే విధంగా ఎన్టీఆర్ విదేశీ విద్య పథకాన్ని కొనసాగించనున్నామని మంత్రి పేర్కొన్నారు. వెనకబడిన తరగతుల సంక్షేమం కోసం త్వరలోనే బీసీ కమిషన్ ఏర్పాటు చేయనున్నట్టు మంత్రి తెలిపారు. అదేవిధంగా చేనేత కళాకారులు, హస్త కళాకారులకు తగిన సబ్సిడీలు, ప్రోత్సాహకాలు అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రజలు తమ జీవన శైలిలో యోగాను ఒక భాగంగా చేర్చుకుని ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవడానికి తమ వంతు కృషి చేయాలని విజయవాడ ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధన సంస్థ, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు, పరిశోధనా అధికారి డాక్టర్ ఎ. జె. వి. సాయి ప్రసాద్ ఓ ప్రకటనలో కోరారు. ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని దేశంలో ఈ సంవత్సరం 100 నగరాలలో 100 యోగాభ్యాస అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. దీనిలో భాగంగానే ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధన సంస్థ, విజయవాడలో రేపు ఉదయం 6 గంటల 30 నిమిషాలకు సామూహిక యోగాభ్యాసం ప్రారంభించనున్నట్లు ఆనయ తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =